క్లుప్తంగా

నేటితో ముగియనున్న ఆధార్ ప్రత్యేక శిబిరాలు



అంగర సిద్ధార్థ కళాశాలలో విద్యార్థి ఆధార్ వివరాలను నవీకరిస్తున్న డిజిటల్ అసిస్టెంట్

కపిలేశ్వరపురం: మండలంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈనెల 19న ప్రారంభమైన శిబిరాల్లో విద్యార్థుల ఆధార్‌లో వివరాలను నవీకరించడం ప్రధాన లక్ష్యంగా సాగాయి. కపిలేశ్వరపురం, మాచర, వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోనూ, తాతపూడి, టేకి 2, కాలేరు, వెదురుమూడి, వాకతిప్ప నల్లూరు సచివాలయాల్లోనూ, గురువారం అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాల, కోరుమిల్లి సచివాలయాల్లోనూ ప్రత్యేక ఆధార్ వైద్య శిబిరాలను నిర్వహించారు. శుక్రవారం అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాల, కోరుమిల్లి సచివాలయాల్లో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి తెలిపారు. ఈ శిబిరాల్లో కపిలేశ్వరపురం, వల్లూరు, టేకి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి మల్లేశ్వరరావు, కె.దొరబాబు, ఫణీంద్ర సేవలందిస్తున్నారు.

ఉల్లాసంగా వన సమారాధన



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

కె.గంగవరం: మండలంలోని అముజూరులో గురువారం నిర్వహించిన కార్తీక వన సమారాధన ఉల్లాసంగా జరిగింది. గ్రామానికి చెందిన స్నేహితుల బృందం ఆధ్వర్యంలో పామర్రు–కూళ్ల రహదారి మధ్యన పొలాల వద్ద నిర్వహించిన ఈ వన సమారాధనలో గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు. తొలుత ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆట పాటలు, నృత్యాలతో సాయంత్రం వరకూ ఉల్లాసంగా గడిపారు.

పర్యావరణ పరిరక్షణతో కాలుష్య నియంత్రణ



మొక్క నాటుతున్న డీవైఈఓ

కాజులూరు: కాలుష్య నియంత్రణకు పర్యావరణ పరిరక్షణ ఒక్కటే మార్గమని కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై పలు మెళకువలు నేర్పించారు. పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఆయన వెంట స్కూల్ హెచ్ఎం పంపన కృష్ణమూర్తి, నారాయణమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సాయిబాబాకు క్షీరాభిషేకం



సాయిబాబాను దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు

మండపేట: కార్తీక మాసం సందర్భంగా తర్వాణీపేటలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో చైర్‌పర్సన్ దుర్గారాణి పూజలు చేశారు. బాబాకు క్షీరాభిషేకం నిర్వహించి, అనంతరం విభూది అభిషేకం చేశారు. తర్వాత బాబాకు పుష్పాలంకరణ చేశారు. తర్వాణీపేట పరిసర ప్రాంతాల్లోని మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి బాబాను దర్శించుకున్నారు.

ఆదమరిస్తే 'యమ'పురికే..

- కూళ్ల–బ్రహ్మపురి ఏటిగట్టు రోడ్డు దుస్థితి
- ప్రాణాంతకంగా మారిన తుప్పలు
- మలుపుల్లో కానరాని హెచ్చరిక బోర్డులు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు



కోటిపల్లి వద్ద అప్రోచ్ లేని ఏటిగట్టు రహదారి



కోట వద్ద ఏటిగట్టుపై ప్రమాదకరంగా ఉన్న వంతెన



కోటిపల్లి–కోట రహదారిలో గట్టుపై రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు

కె.గంగవరం: ఓ వైపు గోదావరి, మరోవైపు పచ్చని పొలాల మధ్య ఊళ్లు. ఇది ఏటిగట్టుపై ప్రయాణించే వారికి ఆహ్లాదకరంగా తారసపడేవి. గోదావరి అందాలను చూస్తూ మైమరపులో ఆదమరిస్తే ప్రమాదం బారిన పడాల్సిందే. ఏటిగట్టు అభివృద్ధిలో భాగంగా రహదారి నిర్మించినప్పటికీ, పర్యవేక్షణ లోపంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపూరి వరకు మల్లవరం, సుందరపల్లి, కోటిపల్లి, కోట, మసకపల్లి, బ్రహ్మపూరి, దంగేరు శివారు గ్రామాల మీదుగా సుమారు 21 కిలోమీటర్ల మేర ఏటిగట్టు ఉంది. ఇటు రావులపాలెం వెళ్లాలన్నా, అటు యానాం, అమలాపురం వెళ్లాలన్నా ప్రయాణికులు ఈ ఏటిగట్టునే ఆశ్రయించాలి. కొన్నిచోట్ల ఏటిగట్టు కోతకు గురై అపాయకరంగా ఉండడం, మరోవైపు ప్రమాదకర మలుపులు, ఇంకోవైపు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, పిచ్చి మొక్కలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

తుప్పలతో తిప్పలు

ఏటిగట్టుపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. గతంలో కురిసిన వర్షాలకు కోటిపల్లి నుంచి కోట వరకు ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా పెరిగాయి. ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడం, దీనికి తోడు తప్పలు రోడ్డు మధ్య వరకు ఎదగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. గత రెండు నెలల క్రితం తుప్పలను తొలగించినప్పటికీ, మళ్లీ ఎదిగిపోయాయని చెబుతున్నారు. పూర్తి స్థాయిలో వీటిని తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ఇరుకు వంతెన.. ఆపై..

అసలే ఏటిగట్ట ఇరుకుగా ఉంటుంది. దీనిపై ఉన్న ఇరుకు. దీనికి తోడు వంతెనకు ఇరువైపులా ప్రమాదకర మలుపులతో అపాయకరంగా మారిందని ప్రయాణికులు అంటున్నారు. మండలంలోని కోటిపల్లి–కోట ఏటిగట్టుపై ఉన్న ఈ వంతెన వద్ద గత రెండు నెలల కాలంలో పలువురు ప్రమాదాలకు గురై, తీవ్రంగా గాయపడి ఆస్పత్రులపాలయ్యారు. గత రెండేళ్ల కాలంలో పదుల సంఖ్యలో వాహనదారులు మృతి చెందారని స్థానికులు చెబుతున్నారు. ఈ వంతెన వద్ద ఆర్అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పర్యవేక్షణ అవసరం

ఏటిగట్టు ప్రమాదరకంగా ఉంది. ఎప్పటికప్పుడు ప్రయాణికులకు అప్రమత్తం చేసి, రోడ్డు బాగోగులు చూసుకునేందుకు అధికారుల పర్యవేక్షణ అవసరం. తుప్పలు, మలుపుల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

– వాసంశెట్టి శ్రీను, మసకపల్లి

తుప్పలను తొలగిస్తాం

ఏటిగట్టుకు ఇరువైపులా ఉన్న తుప్పలను వెంటనే తొలగిస్తాం. గతంలో రెండు సార్లు తుప్పలను తొలగించాం. గత వర్షాకాలంలో కురిసిన వానల కారణంగా మళ్లీ తుప్పలు పెరిగాయి. దీంతో పాటు ఏటిగట్టుపై ప్రమాదకర పరిస్థితులున్న చోట్ల హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తాం.

– సూర్యనారాయణ, డీఈ, ఆర్అండ్‌బీ

షరీఫ్‌ను కలిసిన ముస్లిం, మైనారిటీ నాయకులు



షరీఫ్‌కు అభినందనలు తెలుపుతున్న ముస్లిం నాయకులు

మండపేట: ప్రభుత్వ మైనారిటీ సలహాదారుగా నియమితులైన ఎంఏ షరీఫ్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్టు ముస్లిం మైనారిటీ సల్మాన్ హుస్సేన్, షేక్ ఇబ్రహీం, షేక్ కరీం తెలిపారు. గురువారం నరసాపురంలోని ఆయన నివాసానికి వెళ్లి కలిసి అభినందనలు తెలిపినట్టు పేర్కొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



కార్తిక వన సమారాధనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని ప్రజాప్రతినిధుల కార్తిక వన సమారాధన గురువారం ఎంపీపీ అంబటి భవాని ఆధ్వర్యంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగింది..ఉదయం కార్తిక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. పార్టీలకతీతంగా జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్(బాబీ), మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల ప్రజాపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న క్రిస్టియన్ నాయకులు

మండపేట: రెండు రోజులపాటు సాగిన అంతర్జాతీయ క్రైస్తవ సమావేశాలు ముగిసినట్టు నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఫౌండర్ ప్రెసిడెంట్ శ్యాంపాల్ తెలిపారు. పెద్ద కాలువ వంతెన వద్ద ఉన్న ఏసు క్రీస్తు మహిమ ఆవరణ చర్చిలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్యాంపాల్ మాట్లాడుతూ ఈ సమావేశంలో రాబోయే కొత్త సంవత్సరం 2025లో చేసే పలు సేవా కార్యక్రమాలు రిపబ్లిక్ డే, యాంటీ సూసైడ్ డే, యూత్ డే వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనే కార్యాచరణ గురించి చర్చించామన్నారు. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ కార్యదర్శి సంగీత పాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీలో తాను భాగస్వామి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అంతే కాకుండా ఈ సంస్థ ద్వారా అనేకమంది నిరుపేదలకు సహాయం అందించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అంతే కాకుండా మండపేటలోని ఏసుక్రీస్తు మహిమ ఆవరణ చర్చి వద్ద ప్రార్థన సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. ఈ చర్చి ద్వారా కూడా అనేక మందికి సహాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జార్ఖండ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రాజు సాల్మన్, వైస్ ప్రెసిడెంట్ బ్రిటి బ్యూలా, బత్తుల ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జయప్రదం చేయాలి



దివ్యాంగుల దినోత్సవం వివరాలను వెల్లడిస్తున్న సమితి నాయకుడు రాంబాబు

మండపేట: వచ్చే నెల 3వ తేదీన నిర్వహించే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర నాయకులు మేడిశెట్టి రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు 3న దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మగుండం చెరువు వెనక ఉన్న దివ్యాంగుల భవనం వద్ద పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆటల పోటీలు ఏర్పాటు చేస్తున్నామని, ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఉచితంగా ఆర్టీసీ బస్సు, రైల్వే పాసులకు దరఖాస్తులు ఇస్తామన్నారు. వీటి కోసం ఆధార్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, వికలాంగుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దూళి జయరాజు, గాలింకి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు షేక్ నబి, కుడిపూడి శ్రీను, అనసూరి విజయ్, సుబ్బారావు, రాయపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన పరంజ్యోతి వర్ధంతి సభ



వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో ఆయన వర్ధంతి సభను డిసెంబర్ ఒకటిన నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకులు గురువారం తెలిపారు. పీడిత ప్రజల కోసం నిరంతర పోరాటాలతో జీవితం గడిపిన పరంజ్యోతి వర్ధంతి సభను ఆయన అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు, కర్షక, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ప్రజా సంఘాల నాయకులు చింతా రాజారెడ్డి, అంబటి కృష్ణ, చల్లపూడి పట్టాభి, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఫూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు



గొల్లపాలెంలో పూలే విగ్రహానికి నాయకుల నివాళి



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాజులూరు: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు యువతకు ఆదర్శం కావాలని శెట్టిబలిజ సంఘం నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు మేడిశెట్టి శ్రీరాములు అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలలో పూలే వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. గొల్లపాలెంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు నున్న కాశీవిశ్వనాథం, మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు దేవు సదానందమూర్తి తదితరులు పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. దుగ్గుదుర్రులో స్థానిక నాయకుడు కడలి రాంపండు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేత,, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ పూలే విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించారు. అణగారిన వర్గాల సంక్షేమానికి జ్యోతిరావు పూలే చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

సమానత్వాన్ని చాటిన మహనీయుడు జ్యోతిరావు పూలే

మండపేట: దేశంలో సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని బీసీ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. పూలే వర్ధంతిని గురువారం పట్టణంలో బీసీ సంఘం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. స్థానిక పెద్దకాలువ వంతెన వద్ద ఉన్న పూలే విగ్రహానికి వారు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే కరాచీ సెంటర్‌లో ఉన్న పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మల్లువలస గణపతి, కోన సత్యనారాయణ, దూలి జయరాజులు మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు పూలే అని కొనియాడారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్ కార్యాలయంలోను పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో నాయకులు వీరమల్లు శ్రీనివాస్, పెంకే గంగాధర్, విన్నకోట రాధాకృష్ణ, తీగిరెడ్డి మహేష్, చుక్కల అప్పారావు, పంపన శ్రీనివాస్, ఒంపోలు పోలరాజు, కాశిన కాశీవిశ్వనాథం, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పూలే సేవలు మరువలేనివి

రామచంద్రపురం రూరల్: మహాత్మా జ్యోతీరావు పూలే సేవలు మరువలేమని ఎంబీసీ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు అన్నారు. ద్రాక్షారామలో పూలే వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, పూలే సేవలను కొనియాడారు. దేశంలో ప్రథమ సంఘ సంస్కర్తగా, స్త్రీ విద్య కోసం తన భార్య సావిత్రీబాయిని చదివించి, ఆమె ద్వారా స్త్రీవిద్య కోసం పాఠశాల నడిపిన మహనీయుడని శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, కొసనా కామేశ్వరరావు, నేదునూరి సూరిబాబు, మేడిశెట్టి శ్రీనివాస్, గారోజు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

176 మందికి వైద్య పరీక్షలు



అంగర పీహెచ్‌సీలో పరీక్ష చేస్తున్న వైద్యులు

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలో గురువారం ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ మండపేట యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీలోని బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ బ్లాక్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో రాజమహేంద్రవరంలోని శ్రీసాయిరాం డెంటల్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ శ్రీలేఖ దంత సమస్యలకు వైద్యసేవలందించారు. అగర్వాల్ కంటి ఆసుపత్రికి చెందిన డా.ఎస్.విజయ, హీలియస్ ఆర్థో అబ్జెక్ట్ హాస్పిటల్ డాక్టర్ రఘు, పల్స్ కార్డియాక్ హాస్పిటల్ డాక్టర్ యశ్వంత్ రోగులను పరీక్షించారు. మొత్తం 176 మందికి వైద్యసేవలందించామని ఎన్జీవోస్ అసోసియేషన్ మండపేట యూనిట్ అధ్యక్షుడు జిత్తుక మల్లికార్జునుడ తెలిపారు. శిబిరాన్ని ఎంపీడీఓ కె.రత్నకుమారి, వైద్యాధికారి డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, ఈఓపీఆర్డీ మోహన్ పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. శిబిరంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.సుధాకర్, డీసీ సభ్యులు టి.ఇమ్మానుయేల్, యూటీఎఫ్ నాయకులు ఆర్.సురేంద్ర, ఐ.సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానానికి మరింత పదును

- సామాజిక మాధ్యమం వేదికగా విజ్ఞాన వికాసం
- సాహిత్య అధ్యయనం కోసం సోషల్ మీడియా గ్రూపులు
- విలువైన పాతకాలం నాటి పుస్తకాలు సైతం లభ్యం
- సాహిత్యాభిమానుల వినూత్న కృషి
- రెండు నియోజకవర్గాల్లో విశేష సేవలు



గ్రూపు గుర్తింపు కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకం లోగో

కపిలేశ్వరపురం: మానవ సమాజ పరిణామ క్రమంలో మనిషి అంచలంచెలుగా వృద్ధి చెందుతూ నేటికి అధునాతన మనిషిగా ఉద్భవించాడు. ఈ క్రమం వెనుక సాహిత్యం తోడ్పాటు కీలకంగా ఉందని ప్రగతిశీల సంఘాల నాయకులు చెబుతున్నారు. మానవ అవసరాలు తీర్చుకునేందుకు కలిగిన అవరోధాలను ఎదుర్కొనే శక్తిని ప్రసాదించిన అనేక ఆయుధాల్లో సాహిత్యం ఒకటి. నేటికీ సాహిత్య అధ్యయనం ప్రాధాన్యత కొనసాగుతోంది. సామాజిక మాధ్యమాల్లో గ్రూపులుగా ఏర్పాటై పుస్తకాలను షేర్ చేసుకుంటూ అధ్యయనం చేస్తున్నారు. అంతటి కృషి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో విశేషంగా సాగుతోంది.

సామాజిక కృషి ఇలా..

రామచంద్రపురానికి చెందిన డాక్టర్ చెలికాని రామారావు భారత పార్లమెంట్‌లో తొలి పార్లమెంటేరియన్‌గా సేవలందించారు. డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ పేరుతో ఆయన కుమారుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ సమకాలిన అంశాలపై రచయితలు, సాహితీవేత్తలు, ప్రగతిశీల శక్తులను ప్రోత్సహిస్తూ అనేక పుస్తకాలను ప్రచురించి పాఠక లోకానికి అందజేస్తున్నారు. వారి ఆధ్వర్యంలో ప్రచురితమైన మనిషి, సమాజం తదితర పుస్తకాలు మానవ జీవితంలోని శాస్త్రీయ అంశాలు సవివరంగా ఉన్నాయి. ఆయా పుస్తకాలపై రామచంద్రపురంలో సమీక్షలను నిర్వహించి సాహిత్యానికి విశేష కృషి చేశారు.

మండపేటలో డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ మెహర్ ప్రసన్నలు సంగమం సంస్థ పేరుతో సామాజిక అంశాలపై చర్చా వేదికలను నిర్వహించారు. కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన పెద్దింశెట్టి రామకృష్ణారావు 'పుస్తకం' పేరుతో ఓ వాట్సాప్ గ్రూపును రూపొందించి సాహిత్య కృషి చేస్తున్నారు. యూటీఎఫ్ తదితర ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు సాహిత్య అధ్యయనానికి ప్రత్యేక వాట్సాప్, టెలిగ్రాం మాధ్యమాలు ద్వారా గ్రూపులను ఏర్పాటు చేస్తూ చర్చిస్తున్నారు. గ్రూపు సభ్యులు తమ వద్ద ఉన్న పీడీఎఫ్ ఫార్మాట్‌లోని వివిధ రకాల పుస్తకాలను గ్రూప్‌లో పోస్ట్ చేసుకుంటున్నారు. చదివిన అనంతరం వాటిపై చర్చించుకుంటూ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. పుస్తకం గ్రూపు తరచూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సాహితి సభలను సైతం నిర్వహిస్తోంది. నీతి కథలు, చిన్నపిల్లల కథలు, చందమామ కథలు, ప్రపంచ చరిత్ర, పలు రంగాలకు చెందిన వారి జీవిత చరిత్రలు, అభ్యుదయ, దళిత, కమ్యూనిజం, మతం, తత్వశాస్త్రం, సైన్స్, ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యం, సాంస్కృతిక అంశాలకు చెందిన రచనలను సభ్యులు పోస్టు చేసుకుంటున్నారు.

సామాజిక అంశాలపై చర్చిస్తున్నాం



సాంకేతికతతో ప్రజల్లో సమాజంపై అవగాహన కల్పించేలా కృషి చేస్తున్నాను. మంచి సినిమా వాట్సాప్ గ్రూపుతో మానవ సమాజంలో కళలు, సాహిత్యం ప్రామాణికంగా సినిమా ఉనికిలోకి వచ్చిన తీరుపై చర్చిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా కమర్షియల్ అయిపోయిన విపత్కర పరిణామాలపై కూడా చర్చిస్తున్నాం.

– గౌరవ్, సామాజిక కార్యకర్త, పసలపూడి, రాయవరం మండలం.

శ్రమయే అన్నింటికీ మూలం



ఆధునికంగా కనిపిస్తున్న అభివృద్ధి నేటి తరం వారికి సహజ సిద్ధంగానో, సృష్టిగానో అనిపిస్తుంది. మనిషి జీవితం సామూహికమైంది. సమాజ పరిణామ క్రమంలో మనిషి తన శ్రమతో నేడు ఈ స్థితికి చేరుకున్నాడు. ఈ శాస్త్రీయమైన అంశాలు అర్థం చేసుకోవాలంటే మానవ జీవ పరిణామ క్రమాన్ని తెలియజేసే పుస్తకాలను అధ్యయనం చేయాల్సిందే.

– డాక్టర్ చెలికాని స్టాలిన్, డాక్టర్ చెలికాని రామారావు స్మారక కమిటీ, రామచంద్రపురం

క్రమం తప్పకుండా సాహితీ సమావేశాలు



సామాన్యుల జీవన స్థితిగతుల వెనుక గత కాలపు చరిత్ర దాగి ఉంటుంది. మనిషి తన శారీరక, మానసిక శ్రమలతో నేటి స్థితికి సమాజాన్ని అభివృద్ధి చేశాడు. అయినప్పటికీ సమాజంలో అంతరాయాలు, అవాంతరాలు కొనసాగుతున్నాయి. దాని వెనుక ఉన్న కారణాలను సాహిత్య అధ్యయనం ద్వారా విశ్లేషిస్తున్నాం.

– డాక్టర్ చల్లా రవికుమార్, సంగమం సాహితీ సంస్థ నిర్వాహకులు, మండపేట